దేశమా — భర్తయా

శ్రీమతి వీరంరాజు వేంకటరమణాదేవి

(గత సంచిక తరువాయి)

౪

శక్తి రమను వదలివెళ్ళి సంవత్సరమయింది. అప్పటికి యిప్పటికి పరిస్థితు లెంతో తారుమారయినవి. శక్తికోసం కలలుగన్న రమ యీనాడు అతనిని అమితంగా ద్వేషిస్తున్నది. అతని పేరంటేనే తోకత్రొక్కిన త్రాచువలె మండిపడుతున్నది.

శక్తిసింహుడు అన్నతో తగవులాడేడు. భారత స్వాతంత్ర్య జ్యోతి, అపర యుధిష్ఠిరుడు, ధర్మమూర్తియైన రాజర్షి ప్రతాప్‌ను దూషించి, అవమానించి, ధిక్కరించి, దేశద్రోహానికి ఒడిగట్టాడు. రాజ్యక్షేమంకోరకు తమ్ముని దేశబహిష్కరణ గావించాడు. అన్నమీద క్రోధంతో, పగతీర్చుకోవలెనని అగ్బరుపక్షంచేరాడు. అగ్బరుకు రాణాప్రతాప్‌ను పట్టియిస్తానని నిండుకొలువులో బీరాలుపలికాడు. శక్తి సింహునికి చిత్తూర్ కోటను కట్టబెట్టుతానని మాటయిచ్చాడు అగ్బరు.

రమలో ద్వేషం, క్రోధం, అవమానం, బెంగ, దిగులు, భయం, జాలి విహారం చేస్తున్నాయి. రమ హృదయంలో శక్తిసింహుడికి కించిత్తైన స్థానంలేదు. ఆమెలో ప్రేమ సాగరం ఎండిపోయింది. ఆమె హృదయంలో అగ్నిపర్వతంలాంటి ద్వేషం పొగలు గ్రక్కుతున్నది.

ఒకరోజు అర్థరాత్రి రమ ఏదో తీవ్రంగా ఆలోచించుకుంటూ మేడపైన అటుఇటూ కాలుగాలిన పిల్లిలాగా తిరుగుతున్నది. ఆమెలో క్రోధం, ఉద్రేకం ఉట్టిపడుతున్నవి. ఆమె తన పమిటను గట్టిగా నడుముకు బిగించింది. నడుముకు పెద్దకత్తి ఒకటి వేలాడుతున్నది. అవమానిత ఫణిరాజమువలె బుసలు కొట్టుచున్నది. దీర్ఘ శిరోజములను విరబోసుకొని అపర చండికవలె ప్రకాశిస్తున్నది.

ఆలోచనా తరంగములలో తేలియాడుచూ, "ఛీ ... కులపాంసుడు, దేశద్రోహి, ధర్మద్రోహి శక్తినితాకి అపవిత్రురాలనయ్యాను. అనరాధముని ప్రేమించి నా వంశానికి తీరనికళంక మాపాదించాను. ఈ మచ్చను బాపుకోటం ఎట్లా? ఈ పాపంనుంచి విముక్తి పొందటం ఎట్లా?

ఆ ... నా శరీరాన్ని తాకిన పాపానికి, వానిని యీ కత్తికే బలియిస్తాను. ఆ రక్తంతో భారత మాత పాదపంకజాలను అర్చించి ధన్యత జెందుతాను.

ఈ జన్మకు ప్రేమలేదు, దాంపత్యంలేదు. ఆ దేశద్రోహిని పతిగా స్వీకరించి నాకు, నా తండ్రికి, మహారాణాకు, భారతాంబకు ద్రోహంచెయ్యను. ఈ జన్మలో ఆజన్మ బ్రహ్మచారిణిగానైనా ఉంటాను గాని, ఆ నీచుని భర్తగా స్వీకరించకూడదు.

రమ హేళనగా నవ్వుతూ, "ఆ మూర్ఖుడు ... శక్తి, భారత స్త్రీ అంటే వారాంగన అనుకున్నాడు. కామానికి దాసురాలననుకున్నాడు. శరీరానిని నీచులకమ్ముకుంటుదనుకున్నాడు.

ఇంక తెలుసుకుంటాడు! స్త్రీ సాహసమూర్తని, రణచండికని, త్రిపురాసురమర్దని అని ... దేశ ద్రోహిని శిక్షించి, ధర్మాన్ని కాపాడవలసిందే.”

ఇంతలో ఆలోచనా కెరటాలను భగ్నంచేసింది ఒకశబ్దం. రమ కత్తిదీసుకొని గబగబ అలికిడివచ్చినవైపు అంగలేస్తూ వెళ్ళింది. మేడమెట్లు ఎక్కుతున్నాడు ఒక విలాస పురుషుడు కత్తిని వయ్యారంగా త్రిప్పుకుంటూ.

రమ ఎదురుగా వెళ్ళింది. ‘ఆగు. ఎవరు నీవు’ అని గదమాయించి అడిగింది.

‘నేనే రమ ... నీ ప్రియుడ్ని ... శక్తిని’ అన్నాడు విలాసంగా.

రమ ఉలిక్కిపడ్డది. రక్తం గడ్డకట్టింది. కొద్ది క్షణాలలో తేరుకుంది. సాహసం చిక్కబట్టింది.

“ఎవరు నీవు ... నా ప్రియుడివా ... దుర్మార్గా ... నా ప్రియుడనంటున్నావుగా-నా ప్రియుడు రాజర్షి ప్రతాపునితో తగవులాడినప్పుడే చచ్చిపోయ్యాడు” అన్నది వెటకారంగా తిరస్కార భావంతో. ఆమె కళ్ళు నెళ్ళగ్రక్కుతున్న ప్రచండ తీక్షణకాంతులు అగ్నిగోళాలులాగా తారాజువ్వలలాగా శక్తిసింహుని ఎదుర్కొన్నవి. శక్తిసింహుడు నిర్ఘాంత పోయ్యాడు. పిడుగువంటి మాటలవిని నిశ్చేష్టుడయ్యాడు. నోటివెంబడి మాట పెగలటంలేదు. అసంఖ్య శత్రువాహినుల నవలీలగా నెదుర్కొను శక్తికి, రమ రణచండికగా, అజేయగా కనుపించింది.

రమ దూసిన కత్తితో సమీపిస్తున్నది. శక్తి కొయ్యబారిన బొమ్మలాగా నిలుచున్నచోట గ్రుడ్లు మిటకరిస్తూ నిలబడ్డాడు. చివరకు ధైర్యం తెచ్చుకొని, దీనంగా ‘రమా నేను నీ బావనుగదూ! ఇంతలోనే మరచిపొయ్యావా నీ చరణ చారణ చక్రవర్తిని’ కండ్లవెంట నీరు గ్రమ్మింది. స్వరం గద్గదికమయింది శక్తికి.

శక్తిని అనుకోకుండాచూచి రమ ఆశ్చర్యచకితయైనది. అతని దీనవచనాలనువిని తనకు తెలియకుండానే శాంతించింది. కోపం జారిపోయింది. కత్తిని ఒరలో దూర్చింది. తలవంచుకొన్నది. ప్రేమప్రవాహము పెల్లుబికింది. ప్రియుడు దీనంగా అర్థిస్తున్నాడే అనేచింత మెరుపువలె మెరిసింది. తన ప్రియుని నిరాకరిస్తున్నాననే శంక కలిగింది. చిత్తం డోలాయమానస్థితిలోపడ్డది.

ఒకడుగు వెనుకకు వేసింది. అంతరాత్మ సింహగర్జన చేసింది. తప్పటడుగు వేస్తున్నావని కొరడాతో కొట్టినట్లనిపించింది. నీచత్వానికి లొంగిపోతున్నావని హెచ్చరించింది. శరీరం యావత్తు గగుర్పాటు చెందింది. ఇదంతా క్షణాలలో జరిగిపోతున్నది. రమ నిలద్రొక్కుకున్నది. తన మనస్సును తన స్వాధీనంచేసుకుంది. దయాదాక్షిణ్యాలకు, ప్రేమానురాగాలకు స్వస్తి చెప్పింది. ఈ మారు జీవితంలో భీష్మ నిర్ణయం చేసుకున్నట్లు ఆత్మవిశ్వాసాన్ని పొందింది. పొరపాటున జీవితంలో యీ సమయంలో త్రొట్రుపాటుపడితే అథఃపాతాళ లోకానికి ఈడ్చుకెళ్ళే భయంకర సుడిగుండాలెన్నో అమె పాదాలక్రింద తారట్లాడుతున్నట్లు గ్రహించింది. హృదయాన్ని పాషాణ సదృశం చేసుకున్నది. పూర్వస్థితిని కొద్దికాలంలోనే పొందింది.

కళ్ళెర్రచేసి చింతనిప్పులు కురిపిస్తూ, “శక్తీ! నీ పేరుచ్చరించటంకూడా పాపమే. భారతభాగ్య విధాతను దొంగచాటుగా డొక్కలో పొడిచావు. ద్రోహంచేశావు. భారతమాత గౌరవాన్ని మంటగలిపావు. నా వంశానికి నీ వంశానికి తీరని కళంకం తెచ్చావు. గంగగోవువంటి వీరాబాయి కడుపున చెడబుట్టావు. పవిత్ర శిశోదియా తులసీ వనంలో గంజాయి మొక్కవు నీవు ... నీ మొగం చూచినా పాపమే. పో ... నీతో ఇంక మాట్లాడినా పాపమే ... అగ్బరు దగ్గరికెళ్ళి ఏదో బీబీని అంటగట్టుకో.”

శూలాలలాంటి యీ మాటలనువిని శక్తి నిర్వీర్యుడై అంజలి ఘటిస్తూ, "రమా! నీ ప్రేమభిక్ష అర్థించటానికే వచ్చాను. నీవులేనిది నేను బ్రతకటంకల్ల."

"ఛీ! నరాధమా ... రమంటే తుచ్ఛకామాన్ని ఆశించే వారాంగన అనుకున్నావా. రమ తన జీవితాన్ని దేశమాత కంకితంచేసింది. నైవేద్యంపెట్టిన అన్నాన్ని ముట్టుకోకూడదని శునకానికేం తెలుస్తుంది. మృతప్రాయుడైన శక్తిని పరిగ్రహించే కులటగాదు. ఇంకవచ్చిన దారిబట్టు ... ఇంక వెళ్ళిపో ..." అని అచ్చటినుంచిలేచి మేడమెట్లుదిగి వెళ్ళిపోతున్నది.

"రమా ... రమా ... ఆగు ... నా ప్రార్థనవిను. తానంతటతావచ్చిన ప్రియుడ్ని తిరస్కరించకు. నీవిచ్చినమాట మరచిపోయ్యావు. అన్నతో తగవులాడింది నిన్ను చిత్తూర్ మహారాణిని చేయవలెననే. స్వర్గసౌఖ్యాల ననుభవించవలెననే" అని కొనఆశతో రమలో భోగకాంక్షను రేగగొట్టుదామనే పాచిక వేశాడు కామపీడితుడు శక్తిసింహుడు.

రమ గిరుక్కున వెనక్కుతిరిగి అసహ్యభావంతో "ఇంక నీ మాటలు కట్టిపెట్టు. నీకు సిగ్గులేదూ! నన్ను వంచించటానికి. నీ సౌందర్యాన్ని చూచి, నీ శూరత్వాన్ని చూచి వరించాననుకున్నావా వ్యర్థుడా! మహారాణా పవిత్ర ఆదర్శమే, స్వాతంత్ర్యమనే ఆశాపాశమే మనల నిద్దరిని కలిపింది. స్వాతంత్ర సమరంలో ఉత్తమోత్తమ సమిధల మవుతామని కలలుగన్నాము. ఈనాడో ఆ పవిత్రబంధం తెగిపోయింది. దేశద్రోహిని, భాతృద్రోహిని, ధర్మనాశకుని చేపట్టి భారతదేశ చరిత్రను కళంకం చెయ్యదలచుకోలేదు. నా ఆశవదలుకో."

"రమా! నేనూరుకుంటున్నకొద్దీ అనవసరంగా మాట్లాడుతున్నావు. నీమీదున్న ప్రేమవల్ల నీవన్న మాటలు సరకుచేయటంలేదు. చిత్తూర్ మహారాణి కాగలుగు అదృష్టం నీ మొహాన లేదు ... ఇంక నేను వెళ్ళుతున్నాను" అని కోపంతో వెనక్కుతిరిగాడు.

"శక్తీ! చిత్తూర్ మహారాణా వవుదువని ఉవ్విళ్ళూరుతున్నావే. నాబొందిలో ప్రాణాలున్నంతవరకు, మేవాడ్ రాజపుత్ర వీరులలో పసికందైన బ్రతికినంతవరకు దేశద్రోహి బాప్పారావల్ సింహాసన మధిష్ఠించలేడు. అంతేకాదు, యీరమ సామాన్యవనిత అనుకున్నావా. దేశద్రోహాన్ని తుదముట్టించే పరాశక్తి యీరమ. మహిషాసురుని మర్ధించి ధర్మప్రతిష్ఠాపనజేసిన మహాశక్తియని గుర్తుంచుకో. ఇంకవెళ్ళు..." అని గబగబ కోపంకొద్ది మేడమెట్లుదిగింది.

శక్తిసింహుని కేమనాలో, ఏమనకూడదో తెలియని అయోమయస్థితిలోపడ్డాడు. భుగభుగ పొగలు గ్రక్కుతున్న అగ్నిపర్వతాన్ని తాకటానికే సాహసించలేకపోయ్యాడు. రమమీదనున్న ఆశాపాశాన్ని కోసివేసుకోలేక, ఆమె వెంటనే మెల్లిగా మెట్లుదిగుతూ, "రమా! ఇంక శెలవు. మనిద్దరికి కలిసేయోగ్యత లేదు..."

రమ క్రోధావేశంతో మాట్లాడుతున్నను ఆమెలోని స్త్రీ మార్దవహృదయం నశించలేదు. ఆమె కనులనుండి నీరు పుష్కరిణీవలె పొంగినవి. విచారంతో 'శక్తీ, ఇంక త్వరపడివెళ్ళు. మాతండ్రి నీరాక తెలుసుకొనినచో నీ బొందిలో ప్రాణాలుండటంకల్ల. భగవంతుడు నీ హృదయాన్ని మార్చినచో అప్పుడే మనపునఃసమాగమము, ఇంక శెలవిమ్ము' అని కన్నీటి బిందువులు రాల్చుచు ఇంట్లోకి వెళ్ళిపోయింది.

ఇక రమ చేతికందని స్వర్గం. దూరాన మెరిసే ఎండమావి. నిరాశ చేసుకొని, ఉత్సాహం నశించి, తిరస్కారంవల్లగల్గిన పరాభవాగ్ని దహిస్తుంటే, అడుగులలో అడుగులు వేసుకుంటూ పేలవంగా నడచిపోయ్యాడు.

అతడు వెళ్ళిపోవటం రమచూస్తునేవున్నది. దుఃఖం కట్టలు తెగిపొర్లింది. మోకాళ్ళమీద తలనానించి వెక్కి వెక్కి ఏడ్చింది. మళ్ళీ శక్తిని పిలుద్దామా అని ప్రలోభపెట్టింది మనస్సు, కాని 'వద్దువద్దు' అని ఆశాపాశాన్ని కోసివేసింది అంతరాత్మ.

*

నాల్గుసంవత్సరములు గడచినవి. రమ ఆహారనిద్రలను మానినందున చిక్కి శల్యమయింది. తండ్రి అనుజ్ఞతీసుకొని రాజర్షి భార్య పాటేశ్వరీదేవిని సేవించి ధన్యనవుదామని వెళ్ళింది. మహారాణాకు రాజ్యం పోయింది. అన్ని యుద్ధాలలో పరాజయమేకల్గింది. అడవులుపట్టి అష్టకష్టాలుపడుతున్నారు.

హల్దిఘాట్ యుద్ధంజరిగింది. ఇదేచివర యుద్ధమని ప్రతాప్ మొండి ధైర్యంతో పోరాడాడు. అసంఖ్యాక శతృవాహినులను చీకాకు పరిచాడు. అయినా పరాజయమేకలిగింది. పరాజితుడై అతిదీన స్థితిలోనున్న అన్నను చూచాడు శక్తిసింహుడు. అతని కఠిన హృదయం ద్రవించింది. ప్రతాప్ కాళ్ళమీద బడి క్షమించమని ప్రార్థించాడు. ప్రాధేయపడ్డ తమ్ముని లేవదీసి కౌగలించుకున్నాడు రాజర్షి ఆనంద బాష్పాలతో.

అగ్బరుకీ విషయం తెలిసింది. తన కొలువువదలి వెళ్ళమని ఆజ్ఞాపించాడు. శక్తి అన్నను చేరాడు. అన్నదమ్ములిద్దరు కోటవెంట కోట 24 కోటలను జయించారు. 'మహారాణా ప్రతాప్‌కీజై' అనే శబ్దం రాజపుత్రస్థానం అంతా మార్మోగింది. అగ్బరు పరాజయం అంగీకరించాడు.

శక్తిసింహుడు అన్నను జేరాడు అనివిన్న రమకు ఆనందానికి అంతులేదు. కుమల్‌మియర్ దుర్గానికి వస్తున్న అన్నదమ్ములకు స్వాగతం ఏర్పాటు చేసింది. ప్రతాప్ శక్తిసింహుల, కీర్తి గానంచేస్తూ సైన్యాలు ప్రవేశించినాయి. రాజపుత్ర స్త్రీలు మంగళనీరాజనాలిచ్చారు, పూలు విరజిమ్మారు, పన్నీరు చల్లారు.

సింహద్వారంవద్ద ప్రతాప్ శక్తిసింహులకొరకు, వేచివున్నారు పాటేశ్వరీ రమాదేవులు. పాటేశ్వరీ తనపతికి మంగళ నీరాజనాలనిచ్చి తన మందిరంలోనికి తీసికెళ్ళింది.

రమ తన మనోహరునికి చందనమద్ది, తిలకందిద్ది 'క్షమించవా, బావా' అని పాదాలమీద స్మృతిదప్పి పడిపోయింది. శక్తి ఆమెకు శీతలోపచారాలొనర్చి తెలివిరాగానే 'క్షమించవలసింది నీవే రమా' అని ఆమెను తన కౌగిలిలోనికి చేర్చుకున్నాడు. ఆరుసంవత్సరాల ఎడబాటు ననుభవించిన ఆ పవిత్ర ప్రేమికులు చిరవాంఛిత కౌగిలిలో పెనవేసుకొని స్వర్గలోక సౌఖ్యాల నన్నిటిని ఒక్క క్షణంలోనే అనుభవించారు.

విజేత మహారాణా ప్రతాప్ రమాశక్తుల వివాహం కన్నుల పండువుగా జేసాడు. రాజపుత్ర లోకమంతా నవదంపతులను నాశీర్వదించారు. వృద్ధదంపతులు కృష్ణసింహ ముక్తాబాయిలు ఆనంద సముద్రంలో తేలియాడారు. అగ్బరుపాదుషా సహితం అమూల్యకానుకలనుపంపి తన శ్రద్ధాంజలి ఘటించాడు.

---o---